క్లుప్తంగా

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తిమ్మాపూర్: వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు తహసీల్దార్ కనకయ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వడ్డెరులు వెనుకబడ్డారని, ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఇళ్లు లేక చాలామంది సంచార జీవనం సాగిస్తున్నారని, అందరకి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, ఉపాధికి గుట్టలు, క్వారీలు కేటాయించాలని విన్నవించారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సంఘం మండల అధ్యక్షుడు సూరం మల్లేశం, కుమారస్వామి శివరాత్రి మోహన్, బోధ శ్రీనివాస్, కృష్ణ, సంతోష్‌కుమార్, పవన్ తదితరులు ఉన్నారు.

మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్ ఇస్తున్న సంక్షేమ సమితి సభ్యులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధి ప్రశాంత్ భవన్‌కు సోమవారం బాలల సంక్షేమ సమితి సభ్యులు వైర్‌లెస్ మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ భవన్‌లో అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు బొల్లం రాధ, రెండ్ల కళింగ శేఖర్, విజయ్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కోర్డినేటర్ ఆవుల సంపత్‌యాదవ్, ఇన్‌చార్జి డీసీపీవో శాంత పలువురు పాల్గొన్నారు.

నేడు బీజేపీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ కల్యాణ మంటపంలో మంగళవారం బీజేపీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నామని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు మావురం సుదర్శన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరవుతారని, జిల్లా పదాధికారులు, మండల శాఖ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో కృష్ణారెడ్డి, సత్యనారాయణ, కోటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో నాయకులు

హుజూరాబాద్/సైదాపూర్: జమ్మికుంట పట్టణంలో మంగళవారం నిర్వహించే ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో పోలీసులు సోమవారం బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. హుజూరాబాద్‌పట్టణంతోపాటు వివిధ మండలాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకొని సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సభకు ఆటంకం కలుగుతుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం



మాట్లాడుతున్న జేడీఎస్ నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట, వావిలాల రోడ్డు ఇసుక లారీలతో పూర్తిగా ధ్వంసమైందని, నూతన రోడ్డు నిర్మించాలని జనతాదల్ (సెక్యులర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వద్లూరి డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం మాట్లాడారు. అధిక లోడ్‌తో ఇసుక లారీల రవాణా సాగుతుందని, కిలోమీటర్ల మేర రోడ్డు చెడిపోయిందన్నారు. ఆయా మండలాల్లోని ప్రజ లు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగులు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దుమ్ము దూళితో అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జక్కెన దా మోదర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ హుజూ రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇప్పలపల్లి వేణు, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

- మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు
- రాష్ట్రంలో ఒకే ఒక దేవాలయం
- వారం రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు
- ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర



కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి గుట్ట

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గుట్టపై కొలువైన మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు చేశారు. రాష్ట్రంలో మత్స్యగిరీంద్రస్వామికి ఒకే ఒక ఆలయం కొత్తగట్టు గుట్టపై ఉండడం విశిష్టతను సంతరించుకుంది. సృష్టికి మూలమైన చతుర్వేదాలను సోమకాసురుడు అనే రాక్షసుడు తస్కరించడంతో విష్ణుమూర్తి మత్స్య అవతారంలో సప్తసముద్రాల అవతల దాక్కున్న సోమకాసురుడిని సంహరించి చతుర్వేదాలను పరిరక్షించాడని పురాణగాథ ఉంది. త్రేతాయుగంలో భూమండలం అంతా నీటితో నిండిపోవడంతో మత్స్య అవతారంలో చతుర్వేదాలను రక్షించిన విష్ణుమూర్తి కొత్తగట్టు కోనేరులో కొలువయ్యాడని, స్వామివారికి గుట్టపై గుడి నిర్మించారని స్థానికులు చెబుతుంటారు. ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉందని దేవదాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఏటా మాఘ శుద్ధ భీష్మ ఏకాదశి రోజు భూదేవి, నీలాదేవితో మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తారు.

మాడవీధుల్లో విహారం

- మాడవీధుల్లో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు అశ్వవాహనం, శేషవాహనం ,గరుడవాహనం, పల్లకిసేవలో భూదేవి, నీతాదేవితో స్వామివారు విహరిస్తారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి దర్శనం చేసుకుంటారు.

కోనేరులో స్నానం

- కోనేరులో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే వ్యాధులు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. పంటలకు చీడపీడలు సోకితే పంటలను కాపాడుకునేందుకు కోనేరులోని నీటిని తీసుకెళ్లి చల్లుకుంటే పంటలు చేతికందుతాయనే నమ్మకం రైతుల్లో ఉంది.

సంతానం కోసం మాల

- సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులు కొత్తగట్టు గుట్టపై మత్స్యగిరీంద్రస్వామి నాకబలి కార్యక్రమంలో పోలు దండ వేసుకుంటారు. కల్యాణం రోజు ధ్వజ స్తంభం వద్ద గరుడబలి ప్రసాదం కోసం సంతానం కోరుకునే మహిళలు కొంగుపట్టి వేదపండితులు వేసే గరుడబలి ప్రసాదం కోసం ఆలయం ముందు ఉంటారు. కొంగులో పడిన ప్రసాదం తీసుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు



గర్భగుడిలో బంగారు చేప

ఏర్పాట్లు పూర్తి చేశాం



కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం పూజాసామగ్రి , ప్రసాదం సిద్ధం చేశాం. ఘాట్‌రోడ్డుపై వాహనాల్లో వచ్చేందుకు ఇబ్బంది కలగకుండా పోలీసులు, వలంటీర్లు పర్యవేక్షిస్తారు. వీఐపీలు, సామాన్య భక్తులకు క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నాం.

–సాగి మల్లరావు, ఆలయ చైర్మన్

ఇలా చేరుకోవచ్చు

- కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి పక్కన కొత్తగట్టు ఆలయం ఉంది. కరీంనగర్ బస్టాండ్ నుంచి 25 కి.మీ, హుజూరాబాద్ నుంచి 10 కి.మీ, వరంగల్ నుంచి 35 కి.మీ దూరం. ప్రతి పది నిమిషాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు: రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వెదిర గ్రామంలో సోమవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆయిల్‌పామ్ సాగుతో మంచి లాభాలు సాధించే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సాహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యాస్మిన్, హార్టికల్చర్ ఆఫీసర్ రోహిత్, ఏఈవో సంపత్, వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, రైతుబంధు కమిటీ కన్వీనర్ దొడ్డ లచ్చిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తడి, పొడి వరిసాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏఈవో మౌనిక

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు, భోగంపాడు, మల్లివానిపల్లి గ్రామాల రైతులకు కోర్ కార్బోనెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, పద్మపాని స్వచ్ఛంద సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతువేదిక భవన్‌లో నిర్వహించిన సదస్సులో ఏఈవో మౌనిక మాట్లాడుతూ... వరిసాగులో తడి, పొడి పద్ధతి ప్రోత్సహించేందుకు కార్బన్ క్రెడిట్ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి ఏడాదికి ఎకరాకు రూ.800 ప్రోత్సాహకంగా అందించనున్నారని, రైతులు పట్టాపాస్‌బుక్, బ్యాంకు ఖాతాబుక్, ఆధార్ కార్డు జిరాక్సులు అందజేయాలన్నారు. వరిసాగు చేసే రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రఫీఖాన్, క్లస్టర్, మండల కో ఆర్డినేటర్లు కొండల్‌రెడ్డి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

చిగురుమామిడి: ఆశ కార్యకర్తలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత కోరారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలన్నారు. ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు కల్పన, సునిత, లక్ష్మి, నాగరాణి, పుష్ప, పూజ తదితరులు ఉన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి



ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న శాంతికుమార్

చొప్పదండి: మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోవడంపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్తిపన్నుకు సంబంధించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. వంద శాతం లక్ష్యం చేరుకోవడానికి శ్రమించాలని కోరారు. ఆస్తిపన్ను, నల్లాబిల్లులు, షాప్ లైసెన్సులు, అడ్వర్‌టైజ్‌మెంట్ ఫీజులు సకాలంలో చెల్లిస్తే పట్టణ ప్రజలకు రెండు శాతం వడ్డీ ఉండదని, బకాయి చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఎస్ రాజేశం, పి. రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా కాలయాపన



మాట్లాడుతున్న రామారావు

హుజూరాబాద్: హుజూరాబాద్ ఉప ఎన్నికలో మంత్రులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఓసీ సామాజిక వర్గాల్లోని పేదల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని, తక్షణమే నెరవేర్చాలని డిమాండు చేశారు. రూ.5 వేల కోట్లతో రెడ్డి, రూ.1,000 కోట్లతో వైశ్య కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ఇతర ఓసీ సామాజిక వర్గాల పేదల సంక్షేమానికి మరో రూ.వెయ్యి కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్ తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. లేకుంటే ఓసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందన్నారు. ఆయన వెంట నాయకులు చందుపట్ల నర్సింహారెడ్డి, గూడూరి స్వామిరెడ్డి, తాటిపల్లి రాజన్న, కంకణాల జనార్దన్‌రెడ్డి, ముచ్చ సమ్మిరెడ్డి, విష్ణుదాస్ గోపాల్‌రావు, బోయినపల్లి దేవేందర్‌రావు తదితరులు ఉన్నారు.

అంటరానితనం నిర్మూలించాలి



చిగురుమామిడి: మాట్లాడుతున్న ఎంపీపీ వినీత

మానకొండూరు: మండలంలోని అన్నారం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు ప్రజలు కుల మత భేదాలు వీడాలని సూచించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో కులవివక్షత కొనసాగుతుందా అని అడిగారు. అంటరానితనం నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొట్ల కిషన్, డిప్యూటీ తహసీల్దార్ నవాజ్, ఆర్ఐ హరికిషన్, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అంటరానితనం నిర్మూలనకు ప్రతినెల సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎంపీడీవో బషీరోద్దీన్, ఆర్ఐ అరుణ, ఏఈ కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సర్పంచ్ మానస, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చిగురుమామిడి: దళితుల్లో సామాజిక చైతన్యం రావాలని, ఉన్నత చదువులతో సాంఘిక అసమానతలు తొలగిపోతాయని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మండలంలోని బొమ్మనపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. జెడ్పీటీసీ రవీందర్, ఎంపీడీఓ నర్సయ్య, ఎస్సై సుధాకర్, నయాబ్‌తహశీల్దార్ రవికుమార్, ఆర్ఐ శైలజ, ఏఈఓ అఖిల, సర్పంచ్ భూంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశం, మాజీ ఎంపీటీసీ రమేశ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాస్, కార్యదర్శి రమణారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మూఢనమ్మకాలను నమ్మొద్దని తహసీల్దార్ మాధవి అన్నారు. మండలంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ప్రజలు హక్కులు, చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందని, రాజ్యాంగం అందరికి సమాన హక్కు లు కల్పించిందన్నారు. వార్డు సభ్యులు, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని చిన్నఆసంపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ అనంతరెడ్డి పలు చట్టాలపైన అవగాహన కల్పించారు. సర్పంచ్ అనంతరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మణ్, అంబేడ్కర్ మండలశాఖ అధ్యక్షుడు మ్యాక వినోద్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, నాయకులు సంజీవ్, శ్రీనివాస్, బాబు, రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు వెంకటరెడ్డి

సైదాపూర్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించనున్నామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు కార్యకర్తలతో మాట్లాడి తెలుసుకున్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో పొత్తు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగట్టే కార్యక్రమాలతో సీపీఐ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎనిమిదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, బత్తుల బాబు, రవీందర్‌రెడ్డి, సంపత్, రవి, కనకయ్య, వెంకటస్వామి, మల్లయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ గడువు పొడగింపు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి నిర్వహించే ఎంపిక పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును ఫిబ్రవరి 8 వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఈ నెల 31 వరకు ఉన్న గడువును పరిపాలనా కారణాల రీత్యా పొడగించినట్లు నవోదయ సమితి, న్యూఢిల్లీ వారు తెలిపారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర వైద్య బృందం సందర్శన

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కేంద్ర వైద్య బృందం సందర్శించింది. ఆరోగ్యకేంద్రంలో ఓపీ, మందుల గది, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి సేవలు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. 108 వాహనాన్ని తనిఖీ చేశారు. రిజిష్టర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న రోగులకు అందిస్తున్న ప్రాథమిక చికిత్స, ఆస్పత్రికి తరలింపు సంబంధించిన రికార్డులను చూశారు. కేంద్ర వైద్య బృందం సభ్యులు అబ్దుల్ అఫీజ్, జ్యోతి సీఎం లోట్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మికుంట: విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రత్నాకర్, సహాయ కార్యదర్శి కేషబోయిన రాముయాదవ్, కోశాధికారి ఆలు వాల విష్ణు, కార్తీక్, అరవింద్, నరేష్, రాంరెడ్డి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



రామడుగు: మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జమ్మికుంట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద...

మహాత్మా గాంధీకి నివాళి

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో సోమవారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీ విగ్రహం, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అందించిన మహానుభావుడని పేర్కొన్నారు. దేశ ప్రజలు అహింస, సత్యం పాటించాలని ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు, వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు జాతీయ పతాకం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు యాత్ర సాగిందన్నారు. వర్ధంతిలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో..

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

హుజూరాబాద్: జమ్మికుంటలో మంగళవారం నిర్వహించే మంత్రి కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ కోరారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కమలాపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన చేస్తారని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతుంటే బీజేపీ నాయకులు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, నాయకులు రమాదేవి, సుశీల, సదానందం, రాజేంద్రప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.